ఆంధ్రప్రభ

Edition: Hyderabad (Andhra Prabha)
Date: 6-9-2006 Page No. 10

# 'భారత సినీ రంగానికి ఎల్వీ ప్రసాద్ చేసిన కృషి మరువలేనిది'




ఎల్వీ ప్రసాద్ స్మృతి చిహ్నంగా పోస్టల్ స్టాంపులను విడుదల చేస్తున్న కేంద్ర మంత్రులు దాసరి నారాయణరావు, షకీల్ అహ్మద్, రాష్ట్ర మంత్రి కె. రోశయ్య, సినీ నటుడు కమల్‌హాసన్ తదితరులు

(ఆంధ్రప్రభ ప్రతినిధి)

**హైదరాబాద్, సెప్టెంబర్ 5:** భారత సినీ రంగానికి ఎల్‌వి ప్రసాద్ చేసిన సేవలు అనితర సాధ్యమని, సినీ రంగంలో ఆయన తీసుకు వచ్చిన మార్పులే నేటి నటులకు మార్గదర్శకమని కేంద్ర సమాచార, సాంకేతిక శాఖ సహాయ మంత్రి షకీల్ అహ్మద్ అన్నారు. ఎల్‌వి ప్రసాద్ (లక్ష్మీ వెంకటప్రసాద్) స్మారక పోస్టల్ స్టాంపును మంత్రి మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి షకీల్ అహ్మద్ మాట్లాడుతూ కమలహాసన్ లాంటి వినూత్న నటులను హిందీ తెరకు పరిచయం చేసిన మహానాయుడు ఎల్‌వి ప్రసాద్ అని ఆయన గుర్తు చేశారు. పేద కుటుంబంలో జన్మించిన ఎల్‌వి ప్రసాద్ చిన్నతనం నుంచి పట్టుదలతో సినీ రంగంలో రాణించారని, నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన ఎంతో ప్రతిభను కనబరిచారన్నారు. ప్రసాద్ ల్యాబ్‌తో పాటు నేత్ర వైద్యశాలను ప్రారంభించిన మహామనిషి అని ఆయన కొనియాడారు. ఆయన చేసిన సేవలకు గుర్తించిన ప్రభుత్వం గతంలోనే దాదా సాహెబ్ పాల్కే అవార్డుతో పాటు ఎన్నో అవార్డులను ఇచ్చిందని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం స్మారక తపాళ బిల్లను విడుదల చేయడం ఎంతో గర్వకారణమని అన్నారు.

కేంద్ర బొగ్గు శాఖ సహాయ మంత్రి దాసరి నారాయణరావు మాట్లాడుతూ చాలా మంది సినీ వ్యామోహంలో పడి జీవితాలను పాడుచేసుకున్నారని, ఇంకా పాడు చేసుకుంటున్నారనీ, కానీ ఎల్‌వి ప్రసాద్ మాత్రం పట్టుదలతో కృషి చేసి అనుకున్నది సాధించారన్నారు. 100 రూపాయలతో ముంబాయికి వెళ్ళి అక్కడ అష్టకష్టాలు పడ్డారని, ఆ తర్వాత నిలదొక్కుకుని సినీ రంగంలో అనితర సాధ్యమైన అద్భుతాలు సాధించిన ఎల్‌వి ప్రసాద్‌కు కేంద్ర ప్రభుత్వం తపాళ బిల్లను విడుదల చేసి సన్మానించడం సరైందేనన్నారు. ఎల్‌వి ప్రసాద్ చూపిన మార్గదర్శకత్వంలో పయనించి 11 మంది నిర్మాతలు హిందీ చిత్ర రంగంలో సిల్వర్ జూబ్లీ సినిమాలను నిర్మించారని ఆయన గుర్తు చేశారు. ఎల్‌వి ప్రసాద్ ఇచ్చిన స్ఫూర్తితోనే తాను తెలుగులో నిర్మించిన 'ఇదెక్కడి న్యాయం' చిత్రాన్ని హిందీలో 'ఏ క్యా ఇన్సాఫ్ హై' అన్న పేరుతో నిర్మించానని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రసాద్ తీసిన గొప్ప చిత్రం ఇలవేల్పు అని ప్రేమించిన ప్రియురాలు తల్లిగా ఇంటికి రాడం ఆ చిత్రంలోని కథాంశమని దాసరి గుర్తు చేస్తూ ఇలాంటి ఎన్నో అద్భుతమైన చిత్రాలను ఆయన నిర్మించారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు బళ్ళారి రాఘవ, కన్నాంబ, ఎన్‌టి రామారావు, ఘంటశాల, బిఎన్ రెడ్డి తదితరుల స్మారకార్థం స్టాంపులను విడుదల చేసిందనీ, అయితే సావిత్రి, చిత్తూరు వి నాగయ్యల పేరుతో కూడా స్టాంపులను విడుదల చేయాలని ప్రతిపాదించామని, ఇందుకు సంబంధించిన ఫైళ్ళు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి వెంటనే సాకరం చేయాలన్నారు.

ఆర్థిక మంత్రి కె రోశయ్య మాట్లాడుతూ ముంబాయిలో వంద రూపాయలతో జీవితాన్ని ప్రారంభించిన ఎల్‌వి ప్రసాద్ సినీరంగానికి వెలుగును ప్రసాదించిన మహానుబావుడన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని చెప్పారు. సంపాదించిన దాన్ని వేరే రంగంలో పెట్టుబడిగా పెట్టకుండా సినీ రంగానికి వెచ్చించారని అన్నారు. పద్మశ్రీ డివిఎస్ రాజు మాట్లాడుతూ ఎల్‌వి ప్రసాద్ తన ప్రతిభతో 12 మంది దర్శకులను తయారు చేసి సినీ రంగానికి అందించారని కొనియాడారు. దేశంలోనే ఎల్‌వి ప్రసాద్ ఎంతో పేరు ప్రఖ్యాతులను సంపాదించారన్నారు.